TELANGANA RISING 2047

RNI.No. TELTEL/2010/32434

# అన్వేషనేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక : 123 | బుధవారం 9 సెప్టెంబర్ 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00

## అంతిమ విజయం సత్యానిదే

ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు

యువత మాత్రం సత్యమార్గంలో ప్రయాణిస్తోంది

ప్రధాని మోదీ



అసత్యాల ప్రతిధ్వనిని సత్యం జయిస్తుందని ప్రధాని మోదీ తాజాగా వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని వడోదరలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి మాట్లాడారు. అసత్యాల ప్రతిధ్వనుల ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కానీ భారత దేశ యువత మాత్రం సత్యమార్గంలో ప్రయాణిస్తోందని చెప్పారు. తప్పుదారి పట్టించే వారు ప్రతి చోటా తారసపడుతూనే ఉంటారని అన్నారు. అంతకుముందు ప్రధాని వడోదరలో రూ.20 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.

## స్పీకర్ కంటతడి దృశ్యాలపై రేవంత్ ఆవేదన..

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిశారు. ఈరోజు(మంగళవారం) అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో ప్రసాద్‌ను పరామర్శించారు. నిన్న(సోమవారం) అసెంబ్లీ ఎదుట జరిగిన పరిణామాలపై స్పీకర్‌ను ముఖ్యమంత్రి ఓదార్చారు. ప్రసాద్‌పై వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలపై ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆవరణలో అధికారులపై దాడుల ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మహిళా అధికారుల పట్ల బీఆర్ఎస్ నేతల అనుచిత ప్రవర్తనపై విమర్శలు గుప్పించింది.

- ప్రసాద్‌కు సీఎం, డిప్యూటీ సీఎం పరామర్శ
- బాధ్యులపై తప్పకుండా తగిన చర్యలు
- ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా
- రాజ్యాంగ పదవుల ప్రతిష్ఠ కాపాడటమే ప్రభుత్వ లక్ష్యం





వార్త 2లో



పరువునష్టం కేసులో రాహుల్‌కు

## ఎదురుదెబ్బ.. పిటిషన్ కొట్టివేసిన బాంబే కోర్టు

ప్రధాని మోదీపై అనుచిత వాఖ్యలు చేశారన్న ఆరోపణలతో నమోదైన పరువునష్టం కేసులో రాహుల్‌గాంధీకి ఎదురుదెబ్బ తగిలింది. పరువునష్టం కేసును కొట్టివేయాలంటూ రాహుల్ వేసిన పిటిషన్‌ను బాంబే హై కోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన విచారణ యథావిధిగా కొనసాగనుంది.

2



కేసీఆర్ ఫాంహౌస్ వద్ద హైటెన్షన్..

## కాంగ్రెస్ శ్రేణుల ముట్టడి యత్నం

: గజ్వేల్ నియోజకవర్గంలోని మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు డప్పు చప్పుళ్లతో ఫాంహౌస్ ముట్టడికి యత్నించారు. దీంతో వారిని ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకుంటున్నారు. ఎర్రవెల్లి ఫాంహౌస్ వద్ద వెయ్యి డప్పులతో చావు డప్పు కొడతామంటూ కాంగ్రెస్ నేతలు ఇచ్చిన పిలుపుతో పోలీసులు అలర్ట్ అయ్యారు. కేసీఆర్ ఫాంహౌస్ వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. చెక్‌పోస్ట్‌లు పెట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఫాంహౌస్‌కు వస్తున్న కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకుంటున్నారు.

వార్త 2లో



కేసీఆర్ చావును

## కోరుకుంటున్న సీఎం రేవంత్: వేముల ప్రశాంత్ రెడ్డి

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరుకుంటున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు.

వార్త 2లో

బీఆర్ఎస్ దాడిలో గాయపడ్డ మహిళా

## పోలీసులకు మంత్రి సీతక్క పరామర్శ



2

తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద నిన్న(సోమవారం) బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దాడిలో గాయపడ్డ మహిళా పోలీసులను మంత్రి సీతక్క పరామర్శించారు. జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను మంత్రికి మహిళా పోలీసు అధికారులు వివరించారు. కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసభ్యంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను అసభ్యంగా తాకారని.. దానికి సంబంధించిన విజువల్స్ చూపించి.. సీతక్కకు మహిళా పోలీసులు ఫిర్యాదు చేశారు. 'మా డ్యూటీలు మేము చేస్తుంటే టీ షర్టులు విసిరేసి మీది మీదికి వచ్చారు.. విధి నిర్వహణలో మేము చాలా ఇబ్బందులు పడ్డాం' అని మహిళా పోలీసులు వివరించారు.



బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై

## ఏకపక్షంగా నిర్ణయం తీసుకునే ఆలోచన మాకు లేదు: స్పీకర్

2



స్పీకర్‌పై తాతా మధు

## వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం కాదు: మహేశ్ గౌడ్

బీఆర్ఎస్ పార్టీని రద్దు చేయాలని మండలిలో తీర్మానం పెట్టామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ మనువాద పార్టీ అంటూ వ్యాఖ్యానించారు.

## ప్రజా ప్రదేశాల్లో ఎమ్మెల్యేలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: ఎమ్మెల్యే పద్మావతి

హైదరాబాద్,

ప్రజా ప్రదేశాల్లో ఎమ్మెల్యేలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళ కానిస్టేబుల్ ముందు బీఆర్ఎస్ నేతలు షర్ట్స్ తీయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై ఇతర సంఘాల ప్రతినిధులతో కలిసి మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశామని అన్నారు. సోమవారం అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనపై మహిళా కమిషన్‌కు అర్జీ ఇచ్చామని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆమె మాట్లాడుతూ.. మహిళా పోలీసుల ఎదుట ఎమ్మెల్యేలు షర్టులు విప్పడం ఆమోదయోగ్యం కాదని తెలిపారు. అన్ని ఆధారాలతో మహిళా కమిషన్‌కు వివరాలు సమర్పించామని చెప్పారు. ఎమ్మెల్యేల చర్య మహిళా గౌరవానికి భంగం కలిగించేలా ఉందని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. బాధ్యులైన ఎమ్మెల్యేలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే పద్మావతి విజ్ఞప్తి చేశారు.



# స్పీకర్ కంటతడి దృశ్యాలపై రేవంత్ ఆవేదన..

## ప్రసాద్‌కు సీఎం, డిప్యూటీ సీఎం పరామర్శ

### బాధ్యులపై తప్పకుండా తగిన చర్యలు

### ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా

### రాజ్యాంగ పదవుల ప్రతిష్ఠ కాపాడటమే ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిశారు. ఈరోజు(మంగళవారం) అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో ప్రసాద్‌ను పరామర్శించారు. నిన్న(సోమవారం) అసెంబ్లీ ఎదుట జరిగిన పరిణామాలపై స్పీకర్‌ను ముఖ్యమంత్రి ఓదార్చారు. ప్రసాద్‌పై వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలపై ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆవరణలో అధికారులపై దాడుల ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మహిళా అధికారుల పట్ల బీఆర్ఎస్ నేతల అనుచిత ప్రవర్తనపై విమర్శలు గుప్పించింది. స్పీకర్‌ను అసభ్య పదజాలంతో దూషించడం ప్రజాస్వామ్యానికి అవమానమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో నిన్నటి ఘటనలపై మీడియాలో ప్రముఖంగా వచ్చిన కథనాల నేపథ్యంలో స్పీకర్‌ను సీఎం పరామర్శించారు. ఈరోజు(మంగళవారం) అసెంబ్లీకి వచ్చిన వెంటనే స్పీకర్ ఛాంబర్‌లో ప్రసాద్ కుమార్‌ను ఓదార్చారు. తనను వ్యక్తిగతంగా దూషించటంతో స్పీకర్ కంట తడి పెట్టుకున్న దృశ్యాలపై ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన చెందారు. బాధ్యులపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటామని స్పీకర్‌కు హామీ ఇచ్చారు. ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అసెంబ్లీ గౌరవం, రాజ్యాంగ పదవుల ప్రతిష్ఠ కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.







# అంతిమ విజయం సత్యానిదే

### ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు

### యువత మాత్రం సత్యమార్గంలో ప్రయాణిస్తోంది

### ప్రధాని మోదీ

ఇంటర్నెట్ డెస్క్:

అసత్యాల ప్రతిధ్వనిని సత్యం జయిస్తుందని ప్రధాని మోదీ తాజాగా వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని వడోదరలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి మాట్లాడారు. అసత్యాల ప్రతిధ్వనుల ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కానీ భారత దేశ యువత మాత్రం సత్యమార్గంలో ప్రయాణిస్తోందని చెప్పారు. తప్పుదారి పట్టించే వారు ప్రతి చోటా తారసపడుతూనే ఉంటారని అన్నారు. అంతకుముందు ప్రధాని వడోదరలో రూ.20 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సభకు పెద్ద ఎత్తున హాజరైన గుజరాత్ యువతను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. 'ఇటీవలే వడోదర, ముంబై మధ్య డబుల్ డెకర్ గూడ్స్ రైలు ప్రారంభమైంది. ఈ రైలు ద్వారా ఒక్క ట్రిప్‌లో 250 ట్రక్కులకు సమానమైన సరకును తరలించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కూడా కొందరు ఎంట్రీ ఇచ్చి విమర్శలు గుప్పిస్తారు. ట్రక్ డ్రైవర్ల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తారు. ట్రక్కుల పరిస్థితి ఏమిటని అంటారు. వాళ్లకు గొణిగేందుకు మరో అంశం దొరికినట్టే' అని ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. 2014కు ముందు సరకు రవాణా ప్రత్యేక కారిడార్ నిర్మాణం కిలోమీటరు మేర కూడా ముందుకు సాగలేదని విమర్శించారు.

# కేసీఆర్ ఫాంహౌస్ వద్ద హైటెన్షన్.. కాంగ్రెస్ శ్రేణుల ముట్టడి యత్నం



సిద్దిపేట,

: గజ్వేల్ నియోజకవర్గంలోని మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు డప్పు చప్పుళ్లతో ఫాంహౌస్ ముట్టడికి యత్నించారు. దీంతో వారిని ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకుంటున్నారు. ఎర్రవెల్లి ఫాంహౌస్ వద్ద వెయ్యి డప్పులతో చావు డప్పు కొడతామంటూ కాంగ్రెస్ నేతలు ఇచ్చిన పిలుపుతో పోలీసులు అలర్ట్ అయ్యారు. కేసీఆర్ ఫాంహౌస్ వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. చెక్‌పోస్ట్‌లు పెట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఫాంహౌస్‌కు వస్తున్న కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకుంటున్నారు.

### ఫాంహౌస్‌కు బయలుదేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు..

మరోవైపు ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బయలుదేరారు. అసెంబ్లీ నుంచి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఆధ్వర్యంలో గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు ఫాంహౌస్‌కు పయనమయ్యారు. కేసీఆర్ చావును కోరుకుంటున్నామంటూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు, ఫాంహౌస్‌కు వెళ్తోన్న పలువురు బీఆర్ఎస్ నేతలను బొల్లారం చౌరస్తాలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వాగ్వివాదానికి దిగారు. 'మా ఇంటికి మేము వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారంటూ' ఫైర్ అయ్యారు. అటు కాంగ్రెస్ నేతలు, ఇటు బీఆర్ఎస్ నేతలు ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు చేరుకుంటున్న నేపథ్యంలో ఏం జరుగుతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

# పరువునష్టం కేసులో రాహుల్‌కు ఎదురుదెబ్బ.. పిటిషన్ కొట్టివేసిన బాంబే కోర్టు

ఇంటర్నెట్ డెస్క్:

ప్రధాని మోదీపై అనుచిత వాఖ్యలు చేశారన్న ఆరోపణలతో నమోదైన పరువునష్టం కేసులో రాహుల్‌గాంధీకి ఎదురుదెబ్బ తగిలింది. పరువునష్టం కేసును కొట్టివేయాలంటూ రాహుల్ వేసిన పిటిషన్‌ను బాంబే హై కోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన విచారణ యథావిధిగా కొనసాగనుంది. రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందానికి సంబంధించిన వివాదం నేపథ్యంలో ప్రధానిని రాహుల్‌గాంధీ .. 'కమాండర్ ఇన్ థీఫ్' అని పేర్కొంటూ సోషల్‌మీడియాలో, సభలలో వ్యాఖ్యానించారు. రాహుల్ వ్యాఖ్యలపై స్పందించిన బీజేపీ కార్యకర్త మహేష్ శ్రీమల్ పరువునష్టం కింద బాంబే హైకోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. దీంతో పరువు నష్టం కేసులో క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను బాంబే హైకోర్టు కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# బీఆర్ఎస్ దాడిలో గాయపడ్డ మహిళా పోలీసులకు మంత్రి సీతక్క పరామర్శ

హైదరాబాద్,

తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద నిన్న(సోమవారం) బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దాడిలో గాయపడ్డ మహిళా పోలీసులను మంత్రి సీతక్క పరామర్శించారు. జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను మంత్రికి మహిళా పోలీసు అధికారులు వివరించారు. కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసభ్యంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను అసభ్యంగా తాకారని.. దానికి సంబంధించిన విజువల్స్ చూపించి.. సీతక్కకు మహిళా పోలీసులు ఫిర్యాదు చేశారు. 'మా డ్యూటీలు మేము చేస్తుంటే టీ షర్టులు విసిరేసి మీది మీదికి వచ్చారు.. విధి నిర్వహణలో మేము చాలా ఇబ్బందులు పడ్డాం' అని మహిళా పోలీసులు వివరించారు. తాము అధికారంలోకి వచ్చాక అంతు చూస్తామని బెదిరించారని ఆవేదన చెందారు. తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఫొటోలు, విజువల్స్ చూసి కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి డ్యూటీలు చేయాల్సిన అవసరం లేదని కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి వస్తోందని తెలిపారు. ఈ క్రమంలో మహిళా పోలీసులకు మంత్రి ధైర్యం చెప్పారు. 'ధైర్యంగా ఉండండి మా ప్రభుత్వం అండగా ఉంటుంది. మీ డ్యూటీ మీరు చేయండి. ఎవరి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదు' అని సీతక్క భరోసా ఇచ్చారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకునే ఆలోచన మాకు లేదు: స్పీకర్

హైదరాబాద్,

తాను ప్రజాస్వామిక పద్ధతిలో సభ నడుపుతున్నానని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వ్యాఖ్యానించారు. నిన్నటి సంఘటనతో తాను బీఆర్ఎస్ నేతలకు మైక్ ఇవ్వనని స్పష్టం చేశారు. ఈరోజు (మంగళవారం) తనకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెబుతారని అనుకున్నానని అన్నారు. ఇవాళ అసెంబ్లీలో స్పీకర్ మాట్లాడారు. తనకు క్షమాపణ చెప్పకపోగా బీఆర్ఎస్ సభ్యులు సభను డైవర్షన్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాను మొదటిసారి బీఆర్ఎస్ సభ్యులపై కోప్పడుతున్నానని తెలిపారు. తనను ఎవరూ ఎప్పుడూ ఏం అనలేదని అన్నారు. తానెప్పుడు మీడియా ముందుకు రాలేదని తెలిపారు.

### కేసీఆర్ సభకు రావాలి..

ఇలాంటి సంఘటనలు తనకు ఎప్పుడూ ఎదురుకాలేదని స్పీకర్ గడ్డం ప్రసాద్ వ్యాఖ్యానించారు. 'నేను చాలా భావోద్వేగంతో ఉన్నాను. ఈరోజు సభను నడిపించలేకపోతున్నా. ప్యానెల్ స్పీకర్‌ను పెట్టి సభ నడిపించాలని కోరాను. మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా వచ్చి క్షమాపణ చెప్పాలి. కేసీఆర్ సభకు రావాలి. ప్రతిసారి సభకు ముందు కేసీఆర్‌కి కాల్ చేస్తాను. నా ఆరోగ్యం సహకరిస్తే వస్తానని కేసీఆర్ చెప్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు సభలో సభ్యుడు కాకపోయినా చర్యలు తీసుకునే అధికారం ఉంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకునే ఆలోచన మాకు లేదు. జరిగిన పరిణామాల పట్ల చింతిస్తున్నాను. ప్యానల్ స్పీకర్‌గా కడియం శ్రీహరిని కూర్చోబెడుతున్నాం. తాతా మధు వ్యాఖ్యలతో ఈ రోజు చైర్ లో కూర్చోవాలని లేదు' అని స్పీకర్ గడ్డం ప్రసాద్ పేర్కొన్నారు.

# స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం కాదు: మహేశ్ గౌడ్

హైదరాబాద్,

బీఆర్ఎస్ పార్టీని రద్దు చేయాలని మండలిలో తీర్మానం పెట్టామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ మనువాద పార్టీ అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ లాంటి పార్టీ ప్రజలకి అవసరమే లేదని.. ఆ పార్టీ ఆలోచన విధానంలోనే దళిత వ్యతిరేకత ఉందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీయే అని అనేకసార్లు రుజువైందన్నారు. భట్టి విక్రమార్క సీఎల్పీ నాయకుడైతే బీఆర్ఎస్ తట్టుకోలేకపోయిందని టీపీసీసీ చీఫ్ అన్నారు. గడ్డం ప్రసాద్ స్పీకర్ అయితే బీఆర్ఎస్ తట్టుకోలేకపోతోందని విమర్శించారు. దళిత స్పీకర్‌ను అధ్యక్ష అని అనలేకనే కేసీఆర్ సభకి రావడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం కాదన్నారు. స్వతంత్ర్య ఉద్యమంలో, తెలంగాణ ఉద్యమంలో దళితుల పాత్ర గొప్పదని అన్నారు. దళితులకు కాంగ్రెస్ పెద్దపీట వేసిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



# కేసీఆర్ చావును కోరుకుంటున్న సీఎం రేవంత్: వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్,

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరుకుంటున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ చావును కోరుకుంటున్నామని షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్.. మీడియా ముఖంగా అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ ఇంటిపైన దాడి చేయిస్తామన్నారని తెలిపారు. ఎందుకు ఇంత స్థాయికి దిగజారుతున్నారో? చెప్పాలంటూ అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.కేసీఆర్ ఇంటి వద్ద వెయ్యి డప్పులతో దాడి చేస్తామని శంకర్ అన్నారని తెలిపారు. అది శంకర్ అన్న మాట కాదని.. సీఎం రేవంత్ రెడ్డి అన్నా మాటని వ్యాఖ్యానించారు. వెంటనే శంకర్‌పై చర్యలు తీసుకోవాలని డీజీపీని డిమాండ్ చేశారు. శాసనసభలో ఈ ముఖ్యమంత్రి ఏం మాట్లాడుతున్నారంటూ సీఎం రేవంత్‌పై వేముల ప్రశాంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ బేషరతుగా సమాధానం చెప్పాలన్నారు.కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. అసెంబ్లీకి రాకుండా ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంపై దాడి చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మగోడువైతే కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోవాలని వేముల ప్రశాంత్ రెడ్డికి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వేముల వీరేశంపై డీజీపీ చర్యలు తీసుకోవాలని అన్నారు. కేసీఆర్ చావు గురించి మాట్లాడినందుకు క్షమాపణలు చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డిని వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

### డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారంటూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఫైర్

అసెంబ్లీ సమావేశాలు సజావుగా జరగాలి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ ఆకాంక్షించారు. అందుకు సహకరించడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన స్పష్టం చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారంటూ అధికార కాంగ్రెస్ పార్టీ నేతలపై ఆయన మండిపడ్డారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అవినీతిని గత సమావేశాల్లో బయటపెట్టామని గుర్తు చేశారు. శిఖండిలా కడియం శ్రీహరిని ముందు పెట్టి రాజకీయాలు చేశారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలపై నిప్పులుచెరిగారు. మమ్మల్ని సభ లోపలికి రానివ్వకుండా తమపైనే కేసులు పెట్టారని ఈ సందర్బంగా ఎమ్మెల్యే అవేదన వ్యక్తం చేశారు.స్పీకర్‌ను ఉద్దేశించి ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి ఏమీ అనలేదని ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చైర్‌ను అవమానించారని డైవర్ట్ చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. సాటి మహిళలను అవమానించే విధంగా మంత్రి సీతక్క మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీలు మాట్లాడిన దానిపై సోమవారమే క్లారిటీ ఇచ్చామని పేర్కొన్నారు.స్పీకర్‌ను తాతా మధు ఏమీ అనలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత్ర రాహుల్ గాంధీని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తిడితే కేసీఆర్ బహిరంగంగా ఖండించారని ఈ సందర్భంగా వివేకానంద గుర్తు చేశారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా మాట్లాడారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వారికి క్షమాపణ చెప్పాలి. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను అవమానించే విధంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడారని వివేకానంద తెలిపారు.

### కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా?: బీఆర్ఎస్ ఎమ్మెల్యే

అసెంబ్లీ గేటు వద్ద ఏం జరిగిందో విచారణ చేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహిళా ఎమ్మెల్యేలం మేము వెనుక ఉన్నామని తెలిపారు. పోలీసులు బారికేడ్లు లాగడంతో మహిళా ఎమ్మెల్యేలు కింద పడ్డారని చెప్పారు. మహిళా పోలీసులను దగ్గర పెట్టి ఇబ్బందులు సృష్టించారని పేర్కొన్నారు. అసెంబ్లీకి వస్తే తమపై దాడులు చేస్తున్నారని అన్నారు.మహిళా ఎమ్మెల్యేలను పోలీసులు ఎందుకు లోపలికి పంపలేదని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆమె ప్రశ్నించారు. సీఎం అసెంబ్లీకి వచ్చి కేసీఆర్‌పైన బూతు పురాణాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పుడు సీఎంగా కేసీఆర్ ఉన్నారా..? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి పాలన చేతగాక పోతే సీఎం పదవికి రాజీనామా చెయ్యాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ స్పష్టం చేశారు.అంతేకానీ కేసీఆర్ ఎందుకు క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నేతలను ఆమె ప్రశ్నించారు. తమకు ఎమ్మెల్యేలుగా సభలోకి వచ్చే హక్కు ఉందన్నారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా? అని కాంగ్రెస్ నేతలను నిలదీశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై కేసు పెట్టి అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని కోవా లక్ష్మీ డిమాండ్ చేశారు.

# ప్రజల హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ సర్కారు: చిరుమర్తి లింగయ్య

### అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నేతల వినతిపత్రం

నల్లగొండ /నకిరేకల్, సెప్టెంబరు 8: (అన్వేషనేత్రం ప్రతినిధి ) తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను నిరాశకు గురిచేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఏడు రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగం కల్పించిన హక్కులు పరిరక్షించాల్సిన అవసరం ఉందని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల





సమయంలో 420 హామీలు, 13 ప్రకటనలు, ఆరు హామీల పేరుతో ప్రజలకు అనేక వాగ్దానాలు చేసిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిలో అనేకం అమలు కాలేదని విమర్శించారు. రైతులకు రైతుబంధు తరహా సాయం, రైతు భరోసా, కౌలు రైతులకు ఆర్థిక భరోసా, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యానిధి, పెండింగ్ ఫీజు బకాయిల చెల్లింపు, పెన్షన్లు, దళితులు, దివ్యాంగులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షంగా బీఆర్ఎస్ బాధ్యత అని పేర్కొన్నారు. రైతులు, నేతన్నలు, విద్యార్థులు, నిరుద్యోగులు, సామాన్య ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులపై పోలీసు కేసులు నమోదు చేస్తూ నిరసనలను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గత వంద రోజులుగా ప్రజా సమస్యలు, ఎన్నికల హామీల అమలుపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య పద్ధతిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకుండా ఎదురుదాడికి దిగుతోందని ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కూడా ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రజలకు ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కు, తమ సమస్యలపై నిరసన తెలిపే హక్కు, హక్కుల కోసం పోరాడే స్వేచ్ఛను కల్పించిందని గుర్తుచేశారు. తెలంగాణలో ఈ రాజ్యాంగ హక్కులను, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని, ప్రజల గొంతును అణచివేయకుండా వారి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని అంబేద్కర్ విగ్రహం సాక్షిగా బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్

### పోలీసు బలంతో ప్రజల గొంతు నొక్కేస్తుంది

### 420 హామీలు అమలు చేసేలా చూడాలంటూ అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణుల వినతి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్: 08 ( అన్వేషనేత్రం ):**

తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా హామీల అమలును ప్రశ్నించే ప్రతిపక్ష గొంతులను పోలీసు బలంతో నొక్కెయిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తూ రాజ్యాంగ హక్కులను కాల రాస్తుందని మాజీ రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణలు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజు మంగలవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయమంటే సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం ఎదురుదాడికి దిగుతుందన్నారు. రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతిపక్షం ప్రశ్నిస్తే పోలీసులతో అణిచివేయడం కాంగ్రెస్ ప్రబుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. గత వారం రోజులుగా బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై, కాంగ్రెస్ ఇచ్ని హామీలపై ప్రజాస్వామ్య పద్దతిలో కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రశ్నిస్తుంటే అసెంబ్లీలో టీఆర్ఎస ఎమ్మెల్యేలపై ముక్యంగా మహిళా ఎమ్మెల్యేలపై దురుసుగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రబుత్వ దిగజారుడుతనమన్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉపయోగించాల్సిన అదికార




యంత్రాంగాన్ని ప్రతిపక్షాలను అణిచివేసేందుకు ఉపయోగిస్తుందన్నారు. నిరసన తెలిపే హక్కు ఇస్తామన్న కాంగ్రెస్ నేడు నిరసన తెలిపే హక్కును హరించి ప్రజాస్వామ్యాన్ని మోసం చేసిందన్నారు. రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకొని అదికారంలోకి వచ్చి రాజ్యంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్కు బుద్ధి చెప్పాలని ప్రజాస్వామ్య విలువల పాఠం చెప్పాలని అంబేద్కరు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ ఎంపీపీ నెమ్మాది బిక్షం, జిల్లా నాయకులు ఉప్పల ఆనంద్, బండారు రాజా, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాలనైదులు, మండలాల అధ్యక్షులు తూడి నర్సింహ్మారావు, వంగాల శ్రీ నివాస్డి, దొంగరి యుగంధర్, జూలకంటి జీవన్రెడ్డి, నాయకులు ఆకుల లవకుశ, ముదిరెడ్డి సంతోష్రెడ్డి, ముదిరెడ్డి అనిల్రెడ్డిలతో పాటు ప్రజా ప్రతినిదులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# 10న చలో హైదరాబాదును విజయవంతం చేయాలి

### పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలి

### ఆరు డి ఏ లను వెంటనే విడుదల చేయాలి

### సిపిఎస్ రద్దు చేయాలి

### హెల్త్ కార్డులను విడుదల చేసి చికిత్స మొదలు పెట్టాలి- డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్‌లి

**నల్గొండ, సెప్టెంబర్ 08(అన్వేషనేత్రం):-**

ఉద్యోగ ఉపాధ్యాయులు పెన్షనర్ల డిమాండ్ల సాధనలో ప్రభుత్వ తీవ్రజాప్యాన్ని, నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ హక్కుల సాధనకై హైదరాబాదులో ఈ నెల 10న జరిగే మహా ధర్నాకు వేలాదిగా తరలిరావాలని మహా ధర్నాను విజయవంతం చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ డిటిఎఫ్ నల్లగొండ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. వెంకటేశం పి. ఏడుకొండలు




తెలియజేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నల్లగొండ పట్టణంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను కలిసిన సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక ముఖ్యమంత్రి కల్లబొల్లి మాటలు నమ్మేది లేదని ప్రభుత్వం దిగివచ్చే వరకు ఉద్యమాలు చేస్తామని 10న హైదరాబాద్ ను లక్ష మందితో ముట్టడిస్తామని తెలిపారు .రెండు సంవత్సరాల తర్వాత మా సమస్యలు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఇక ఎలాంటి హామీలను మాటలను నమ్మబోమని స్పష్టం చేస్తున్నాం. ఉద్యోగ ఉపాధ్యాయులు ఉద్యమాలకు సిద్ధమవుతున్నప్పుడు మరింత ఆగ్రహానికి గురయ్యే విధంగా ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని, ప్రభుత్వం పంతాలను వీడి సానుకూల దృక్పథంతో సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. గత మూడు నెలలుగా ఉద్యోగులు పెన్షనర్ల జీతాల నుండి హెల్త్ కార్డు కొరకు చెల్లింపులు జరుగుతున్నప్పటికీ వాటి ఊసే లేదని, ఉద్యోగ ఉపాధ్యాయులు పెన్షనర్లు అనారోగ్యంతో మరణిస్తున్నారని, గడువు ముగిసి మూడు సంవత్సరాలు కావస్తున్న పిఆర్సి ని మూసి పెట్టారని ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏకంగా ఆరు డీఏలు పెండింగ్లో ఉన్నప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని ఉద్యోగులతో ఫ్రెండ్లీ ప్రభుత్వం అని ఎలా చెప్పుకుంటారని ఆయన ప్రశ్నించారు. సి పి ఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్ లో ఉన్న అన్ని రకాల ఏరియాస్ ను వెంటనే విడుదల చేయాలని, 30 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచినప్పటికీ కనీసం సంఘాలతో మాట్లాడడానికి ప్రభుత్వం సిద్ధపడటం లేదని ఇది చాలా విచారకరమని అన్నారు .ఉద్యమాల ద్వారానే హక్కులు సాధించుకుంటామని అందుకే 10న హైదరాబాదులో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని రాష్ట్ర నలుమూలల నుండి వేలాదిగా తరలివచ్చివిజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎం. డి. ఖుర్షీద్ మియా సీనియర్ బాధ్యులు పీ .భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనిచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

### దళిత స్పీకర్ పై అహంకారపూరిత మాటలు వెనక్కి తీసుకొని మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య

సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్: 08 ( అన్వేషనేత్రం): దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బిఆర్ఎస్ నాయకులు అనుచిత వాక్యాలు తీవ్రంగా ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సీఎం కెసిఆర్, కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నరసయ్య అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దళితులను ముఖ్యమంత్రి చేస్తానని దళితులకి మూడెకరాల భూమి ఇస్తామని మోసం చేసి తాను మాత్రం ముఖ్యమంత్రి అయ్యి రాజ్య భోగాలు అనుభవించి కోట్ల




రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. అంతేకాకుండా దళితులను అగవరపరుస్తూ సీఎల్పీ నేత బట్టి విక్రమార్క చేసినటువంటి పాదయాత్రను హేళన చేస్తూ అగౌరపరిచారని వాక్యానించారు. దళితుల పేరు చెప్పుకొని ముఖ్యమంత్రి అయ్యి దళిత జాతికి దళిత బంధు ఇప్పిస్తామని లక్షల రూపాయలు కమిషన్ హెచ్చించి లక్షల రూపాయలు సామాన్య దళిత ప్రజల నుండి సంపాదించుకున్నారని దుయ్యబట్టారు. మరియు మాజీ సీఎం కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా ప్రజా సమస్యలపై ప్రస్తావించకుండా కాలయాపన చేస్తున్నారని, ఇప్పటివరకు 22 కోట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ ప్రజా సమస్యలపై మాట్లాడకుండా ఫామ్ హౌస్ లకే పరిమితవయ్యారని ఎద్దేవా చేశారు. మరియు మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కి కాళ్లకు చెప్పులు వేసుకునే దుస్థితి లేని నాయకుడు వేలకోట్ల రూపాయలు ఎలా సంపాదించాడని ప్రజలకు వివరించాలని ఆయన అన్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనిచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఎమ్మెల్సీ పదవిని బర్త్ రఫ్ చేసి స్పీకర్కు క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో కాంగ్రెస్ నాయకులు దళితులు అతనికి తగిన బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, సూర్యాపేట పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, చివేంల మండల పార్టీ అధ్యక్షులు వీరన్న నాయక్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, సేవాద జిల్లా అధ్యక్షులు ఆలేటి మాణిక్యం, కౌన్సిలర్స్ కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, రాజేష్ రెడ్డి, నాగుల వాసు, వల్దాస్ రెబల్ శ్రీనివాస్, విజయ్ కుమార్,బానోత్ సైదులు నాయక్, కుంభం రాజేందర్, జ్యోతి శ్రీ విద్యా కరుణాకర్, సాజిద్ , రుద్రంగి రవి, గడ్డం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బుల్లెట్ ట్రైన్ రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా ఆర్యవైశ్య సంఘం నాయకులు

### పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆద్వర్యంలో బుల్లెట్ ట్రైన్ సాధన కోసం ఒకరోజు నిరహార దీక్ష

### ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిజ శ్రీనివాస్

సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్: 08 ( అన్వేషనేత్రం): సూర్యాపేటకు బుల్లెట్ ట్రైను మరియు రైల్వే సాధన కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక రైతు బజార్ వద్ద ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వర రావు ముఖ్య అతిధిగా పాల్గొని బెలిదె శ్రీనివాసులు కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త , సుధాకర్ పివిసి కంపెనీ ఎండి మీలా మహదేవ్ మద్దతు పలికి దీక్ష లో పాల్గొన్న వారికి పూలదండ లు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పెద్దిరెడ్డి రాజా, గందూరి ప్రకాష్, జుట్టుకొండ సత్యనారాయణ,కర్నాటి కిషన్, ధర్మార్జున్ , వూర రామ్మూర్తి యాదవ్, రాపర్తి శ్రీనివాస్, మొరిశెట్టి కోటేశ్వరరావు, బూపతి రాములు, మిర్యాల వెంకటేశ్వర్లు , చల్లమల్ల నరసింహ లు సంఘిభావం ప్రకటించారు. దీక్ష లో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉప్పల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బిక్కుమల్ల కృష్ణ, కోశాధికారి వుప్పల శ్రవణ్ కుమార్, బ్రహ్మాండ్లపల్లి మురళిధర్, చల్లా లక్ష్మయ్య, తోట శ్యామ్ ప్రసాద్, మంచాల రంగయ్య, కర్నాటి రవి, చల్లా లక్ష్మికాంత్, రాచకొండ శ్రీనివాస్, ఈగ దయాకర్ గుప్త, మిట్టపల్లి రమేష్, తాళ్లపెల్లి రామయ్య, సోమ వెంకటేశ్వర్లు, సుమన్ వెంకన్న, గుడిపాటి రమేష్, సోమ ప్రవీణ్, బెలిదె అంజయ్య, బెజగం ఫణి, మహిళా సంఘం అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ బెలిదె రాధ, తల్లాడ



మోహన్, బొల్లం సురేష్, భోనగిరి కృష్ణ, తల్లాడ సోమయ్య, జూలకంటి నాగరాజు, సోమ సోమేశ్వర్,నవిలిపురి నరేందర్, మహంకాళి సోమయ్య, మహిళాసంఘం నాయకులు దేవరశెట్టి ఉమారాణి, లకుమారపు పద్మజ, అక్కినపల్లి సంతోషి, ఓరుగంటి లావణ్య, యర్కచర్ల శోభారాణిలు పాల్గొన్నారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అద్యక్షులు వెంపటి మధు ఆద్వర్యంలో పలువురు మిల్లర్ లు దీక్ష కు సంఘీభావం ప్రకటించారు.



# సూర్యాపేట రైల్వే ఉద్యమానికి ఉపాధ్యాయ లోకం అండ


### లక్ష పోస్ట్‌కార్డుల ఉద్యమం'కు తీకుళ్ళ సాయిరెడ్డి మద్దతు

### ప్రధానికి స్వయంగా పోస్ట్‌కార్డు రాసిన మాజీ రాష్ట్ర అధ్యక్షుడు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ :08 ( అన్వేషనేత్రం ):**

హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు సాధారణ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట రైల్వే సాధన సమితి చేపట్టిన 'లక్ష పోస్ట్‌కార్డుల ఉద్యమం'కు ఉపాధ్యాయ వర్గాల నుంచి మద్దతు లభించింది. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయుఎస్), ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ( ఏపీయుఎస్ ) రాష్ట్ర పూర్వఅధ్యక్షులు తీకుళ్ళ సాయిరెడ్డి ఈ ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి స్వయంగా పోస్ట్‌కార్డు రాసి సూర్యాపేట ప్రజల రైల్వే ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సూర్యాపేటకు హైదరాబాద్ నుంచి రైలు మార్గం కావాలన్నది ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అని సాయిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేటకు నేరుగా రైల్వే అనుసంధానం లేకపోవడం ప్రజలకు తీవ్ర లోటుగా ఉందన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయ అవసరాలతో నిత్యం హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వేలాది మంది ప్రజలకు రైలు సౌకర్యం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక లక్ష మంది ప్రజలతో ప్రధానమంత్రికి పోస్ట్‌కార్డులు పంపించాలన్న రైల్వే సాధన సమితి నిర్ణయం వినూత్నమైన ప్రజాస్వామ్య ఉద్యమమని ఆయన అభినందించారు. ఒక ప్రాంత అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాన్ని సాధించేందుకు ప్రజలను భాగస్వాములను చేస్తూ ఉద్యమాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. "సూర్యాపేటకు హైదరాబాద్ నుంచి రైలు మార్గం కావాలని ప్రధానమంత్రి గారికి లక్ష పోస్ట్‌కార్డుల ఉద్యమం ద్వారా విజ్ఞప్తి చేస్తున్న రైల్వే సాధన సమితికి నా అభినందనలు.





RNI.No. TELTEL/2010/32434
అన్వేషణనేత్రం
ఎడిటర్ : గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

**సంపాదకీయం...**

# అడకత్తెరలో భారత్



కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో ఆగస్టు 31న జరిగిన 'షాంఘై సహకార సంస్థ' శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సమావేశమయ్యారు. పశ్చిమాసియాలో ఇరాన్ -అమెరికా మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు కొనసాగుతున్న సమయంలో జరిగిన ఈ భేటీలో భారత్ -ఇరాన్ సంబంధాలను మరింత బలోపేతం చేయాలన్న సంకేతం వెలువడింది. ఇరాన్‌తో వాణిజ్యాన్ని విస్తరించాలని భారత్ కోరుకుంటున్నట్లుగా మోడీ తెలిపారు. పశ్చిమాసియా పరిణామాలు, పౌరుల భద్రత, సముద్ర మార్గాల రక్షణ వంటి అంశాలపైనా ఇరుదేశాధినేతలు చర్చించారు. ఈ భేటీ జరిగిన మూడు రోజుల తర్వాత, సెప్టెంబర్ 3న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. భారత్ ఇరాన్ మధ్య ప్రస్తుతం వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని తాను భావించడం లేదని రూబియో చెప్పారు. అదే సమయంలో ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను తప్పించుకోవడానికి ఏ దేశమూ సహకరించరాదని హెచ్చరించారు. ఇరాన్ ఆదాయం సమకూర్చుకునేందుకు సహకరించే దేశాలపైనా అమెరికా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈ హెచ్చరిక భారత్‌ను ఉద్దేశించినదేనని నిర్ధారించడానికి ఆధారం లేకపోయినా, మోడీ పెజెష్కియాన్ భేటీ జరిగిన కొద్ది రోజుల్లోనే రూబియో చేసిన వ్యాఖ్యలు భారత్ ముందున్న సవాలును స్పష్టం చేస్తున్నాయి. బిష్కెక్ సమావేశం జరిగిన వేదిక కూడా ప్రస్తుత పరిణామాలకు ప్రత్యేకమైన నేపథ్యాన్ని అందించింది. 1996లో ఏర్పడిన 'షాంఘై ఫైవ్' విస్తరించి 2001లో 'షాంఘై సహకార సంస్థ'గా రూపుదిద్దుకుంది. ప్రస్తుతం చైనా, రష్యా, భారత్, పాకిస్థాన్, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, ఇరాన్, బెలారస్ ఇందులో సభ్యదేశాలుగా ఉన్నాయి. దేశ రక్షణ, ఉగ్రవాద నిరోధం, ఆర్థిక సహకారం, రవాణా అనుసంధానం, ఇంధన భద్రత వంటి రంగాల్లో సహకారం సుగమం చేయడం సంస్థ ప్రధాన లక్ష్యాల్లో కొన్ని. ఇది నాటో తరహా సైనిక కూటమి కాకపోయినా, పాశ్చాత్య దేశాలకు వెలుపల ఉన్న కొన్ని ప్రధాన దేశాలు ఒకే వేదికను పంచుకునే ముఖ్యమైన బహుపాక్షిక వ్యవస్థగా అవతరించింది. ఇటీవలి సంవత్సరాలలో ఇరాన్, బెలారస్ సభ్యులుగా చేరడంతో ఈ సంస్థ భౌగోళిక, రాజకీయ పరిధి మరింత విస్తరించింది. బిష్కెక్‌లో ఎస్‌సిఓ సభ్యదేశాలు పశ్చిమాసియా పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేసి, అంతర్జాతీయ వివాదాలను రాజకీయ, దౌత్యపరమైన మార్గమే శాశ్వత పరిష్కారించగలదని పేర్కొన్నాయి. ఇరాన్‌పై జరిగిన దాడులను ఖండించడం, ఏకపక్ష ఆంక్షలను ప్రశ్నించడం ద్వారా అమెరికా విధానాలకు భిన్నమైన వైఖరిని ప్రదర్శించాయి. ఆ ప్రతిస్పందనలో భారత్ భాగస్వామిగా ఉండటం, మరోవైపు అమెరికాతో తన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించడం న్యూఢిల్లీ అనుసరిస్తున్న బహుముఖ విదేశాంగ విధానంలోని సంక్లిష్టతను, వైరుధ్యాన్ని వెల్లడిస్తున్నాయి. ఇరాన్‌తో సంబంధాలను పూర్తిగా తెంచుకోవడం భారత్‌కు సాధ్యం కాదు. పాకిస్థాన్‌తో వైరం నేపథ్యంలో, ఇరాన్ భూభాగం ద్వారా ఆఫ్ఘనిస్థాన్, మధ్యఆసియా, రష్యా, యూరప్ మార్కెట్లకు చేరుకునే మార్గాలు భారతదేశానికి దీర్ఘకాలిక ప్రాధాన్యం కలిగినవి. భారత్ పెట్టుబడులు పెట్టిన, ఇరాన్ దేశపు ఛాబహార్ నౌకాశ్రయం పాకిస్థాన్‌తో ప్రమేయం లేకుండా ఆఫ్ఘనిస్థాన్, మధ్య ఆసియా ప్రాంతాలతో వాణిజ్య సంబంధాలు పెంచుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని అందిస్తుంది. అంతర్జాతీయ ఉత్తర-దక్షిణ రవాణా కారిడార్ విషయంలోనూ ఇరాన్ పాత్ర కీలకం. భారత్ నుంచి సముద్ర మార్గంలో ఇరాన్‌కు, అక్కడి నుంచి రైలు, రోడ్డు మార్గాల ద్వారా మధ్య ఆసియా, రష్యా వైపు సరకు రవాణా చేసే వ్యవస్థ అభివృద్ధి చెందితే, భారత ఎగుమతులకు కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తాయి. అలా, మధ్య ఆసియాలో తన ఆర్థిక, రాజకీయ ఉనికిని పెంచుకోవాలనుకునే భారత్‌కు ఇరాన్ భౌగోళికం కీలకం. ఛాబహార్, ఐఎన్‌ఎస్‌టిసి వంటి ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టిన తర్వాత ఇరాన్‌తో సంబంధాలను అకస్మాత్తుగా తగ్గించడం అంటే భారతదేశం స్వయంగా నిర్మించుకున్న అనుసంధాన అవకాశాలను తనకుతానుగా బలహీనపరచుకోవడమే అవుతుంది. ఇంధన రంగంలోనూ ఇరాన్‌ను విస్మరించడం భారతదేశానికి సులభం కాదు. అధిక మొత్తంలో చమురు, సహజవాయువు నిల్వలు కలిగిన దేశాల్లో ఇరాన్ ఒకటి. అమెరికా ఆంక్షల కారణంగా భారత్ గతంలో మాదిరిగా ఇరాన్ నుంచి చమురు దిగుమతి చేసుకోవడం ప్రస్తుతానికి సాధ్యం కావడం లేదు. అయితే, పశ్చిమాసియా ఇంధన మార్కెట్‌లో ఇరాన్ స్థానం, మధ్యప్రాచ్య చమురు రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధిపై దాని ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయగలిగే అంశాలు. ఇరాన్ విషయంలో చైనా, రష్యాల పాత్ర కూడా భారత్ నిర్ణయాలను ప్రభావితం ఎంతో కొంత చేస్తుంది. అమెరికా ఆంక్షల ఒత్తిడి పెరిగే కొద్దీ ఇరాన్ బీజింగ్, మాస్కోతో సంబంధాలను మరింతగా విస్తరించింది. చైనా -ఇరాన్ ఆర్థిక సంబంధాలు, రష్యా-ఇరాన్ భద్రతా సహకారం ఇప్పటికే గణనీయమైన స్థాయికి చేరాయి. భారత్ ఇరాన్ నుంచి దూరమైతే, ఆ ఖాళీని చైనా భర్తీ చేసే అవకాశం ఉంది. అలాగే పాకిస్థాన్ కూడా ఇరాన్‌కు మరింత చేరువ కావచ్చు. ఈ రెండు భారత్‌కు అసౌకర్యం కలిగించే పరిణామాలే. అమెరికాతో భారత్‌కు ఉన్న సంబంధం కూడా ఎంతో ముఖ్యమైనది. రక్షణ, సాంకేతికత, పెట్టుబడులు, వాణిజ్యం, ఇండో -పసిఫిక్ భద్రత వంటి రంగాల్లో గత రెండు దశాబ్దాల్లో పరస్పర సంబంధాలు గణనీయంగా విస్తరించాయి. చైనా దూకుడును కొంతవరకు నిలువరించడంలో అమెరికా భారత్‌కు కీలక భాగస్వామిగా మారింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌తో భారత ఆర్థిక సంబంధాలు అమెరికా ఆంక్షల పరిధిలోకి వస్తే, దాని ప్రభావం ప్రభుత్వ స్థాయిలోనే కాకుండా భారత కంపెనీలు, బ్యాంకులు, అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలపైనా పడే అవకాశం ఉంది.

# ఎగుమతిదారులకు ప్రోత్సాహకాలు..!

## యుఎస్ టారిఫ్‌ల వేళ కేంద్రం కసరత్తు

**న్యూఢిల్లీ :**

భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీగా విధించిన టారిఫ్‌ల నేపథ్యంలో ఎగుమతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వడానికి కేంద్రం కసరత్తు చేస్తోంది. ట్రంప్ టారిఫ్‌లతో ఎగుమతిదారుల్లో తీవ్ర ఆందోళనలు నెలకొన్న విషయం తెలిసిందే.



ఈ నేపథ్యంలోనే భారత ఎగుమతిదారులకు మద్దతునిచ్చేలా ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టనుందని రిపోర్టులు వస్తోన్నాయి. రష్యా చమురును కొనుగోలు చేస్తోందనే అక్కసుతో భారత్‌పై ట్రంప్ 50 శాతం టారిఫ్‌లను విధించిన విషయం తెలిసిందే. ఈ అధిక టారిఫ్‌ల వల్ల వస్త్రాలు, జౌళి ఉత్పత్తులు, ఆభరణాలు, రత్నాలు, వ్యవసాయ, మత్స్య సంబంధిత ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోన్న నేపథ్యంలో కేంద్రం ప్రోత్సాహక చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. ఇందులో భాగంగా చిన్న ఎగుమతిదారులు ఎదు ర్కొంటున్న ద్రవ్య పరిమితులను పరిష్కరించాలని కేంద్రం యోచన. అదే విధంగా కంపెనీలపై నిర్వహణ భారం తగ్గించేలా చర్యలు తీసుకోవడంతో పాటుగా ఎగుమతులకు సంబంధించిన రంగాల్లో ఉద్యోగ భద్రతను కల్పించడం, ఎగుమతుల కోసం కొత్త మార్కెట్లను అన్వేషణకు మద్దతునిచ్చేలా కేంద్రం ప్రణాళికలు రూపొందిస్తోందని సమాచారం. గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25 మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా దాదాపు 20 శాతంగా ఉంది.

## ఓలా ఎలక్ట్రిక్‌లో సాఫ్ట్‌బ్యాంక్ వాటా తగ్గింపు

2.15 శాతం వాటా విక్రయం

బెంగళూరు : ద్విచక్ర విద్యుత్ వాహనాల కంపెనీ ఓలా ఎలక్ట్రిక్‌లో జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ 2.15 శాతం వాటాలను విక్రయించింది. దీంతో సాఫ్ట్‌బ్యాంక్ తన హోల్డింగ్ వాటాను 17.83 శాతం నుంచి 15.68 శాతానికి కుదించుకుందని ఓలా ఎలక్ట్రిక్ గురువారం రెగ్యులేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. జూలై 15 నుండి సెప్టెంబర్ 2 మధ్య జరిగిన వరుస విక్రయాల్లో ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్‌లోని కొన్ని ఈక్విటీ షేర్లను విక్రయించిందని పేర్కొంది. 2025 జూన్ 30 నాటికి ఓలా ఎలక్ట్రిక్‌లో సాఫ్ట్ బ్యాంక్ 17.83 కోట్ల షేర్లను కలిగి ఉంది. ఇది 78.65 కోట్ల ఈక్విటీ షేర్లలో 17.83 శాతం వాటాకు సమానం. మార్కెట్ల ముగింపునకు కొద్ది సేపు ముందు ఓలా ఈ విషయాన్ని వెల్లడించింది. మరోవైపు ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 7 శాతం పతనమై రూ.64.49 వద్ద ముగిశాయి. 350సిసి లోపు ఇంజన్ సామర్థ్యం కలిగిన ద్విచక్ర వాహనాలపై జిఎస్‌టిని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం ఓలా ఎలక్ట్రిక్ షేర్లపై ఒత్తిడిని పెంచింది.

# కంపెనీలు జిఎస్‌టి ఫలాలను బదిలీ చేయాలి

## ప్రతీ రూపాయి వినియోగదారుడికి చేరాలి

## వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్

**న్యూఢిల్లీ :**

జిఎస్‌టి కౌన్సిల్ తగ్గించిన పన్ను రేట్లను కంపెనీలు వినియోగదారులకు బదిలీ చేయాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. జిఎస్‌టి తగ్గింపు ద్వారా ఆదా అయిన ప్రతీ రూపాయిని వినియోగదారులకు అందించాలన్నారు. అదే విధంగా దేశీయ ఉత్పత్తులకు ఎక్కువ ప్రచారం కల్పించాలని సూచించారు. భారతీయుల కష్టార్జితంతో ఇక్కడి భూమిలో పండిన ఉత్పత్తులకు మద్దతును అందించాలన్నారు. స్వదేశీ ఉత్పత్తులు దేశంలోని ప్రతీ మూలకు చేరినప్పుడు అవి ఆర్థిక విలువతో పాటు దేశ స్వావలంబనను సూచిస్తాయన్నారు. జిఎస్‌టి శ్లాబులను 5, 18 శ్లాబులకు పరిమితం చేస్తూ బుధవారం జిఎస్‌టి కౌన్సిల్ తీర్మాణం చేసిన విషయం తెలిసిందే. కొత్త పన్ను రేట్లు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలోనే మంత్రి పియూష్ గోయల్ తగ్గిన రేట్లను వినియోగదారులకు బదిలీ చేయాలని కంపెనీలకు, విక్రేతలకు సూచించారు.

## రుణాల విస్తరణకు డిమాండ్ : ఎస్‌బిఐ ఛైర్మన్

జిఎస్‌టి కౌన్సిల్ పన్ను రేట్లను 5 శాతం, 12 శాతానికి పరిమితం చేయడం పరోక్ష పన్ను సంస్కరణల్లో ఒక మైలురాయి అని ఎస్‌బిఐ ఛైర్మన్ సిఎస్ శెట్టి అన్నారు. గతంలో 12 శాతం, 18 శాతం పన్ను విధించబడిన గృహోపకరణాలు ఇప్పుడు 5 శాతంలోకి వచ్చాయన్నారు. ఇది తక్కువ ఆదాయం కలిగిన వారికి ఉపశమనం అందిస్తుందన్నారు.. ఎక్కువ వినియోగ శక్తితో, డిమాండ్, రుణ విస్తరణ పెరిగి ఆర్థిక వృద్ధికి దోహదం చేయనుందని సిఎస్ శెట్టి అన్నారు. బీమా రంగం తక్కువ ప్రీమియంతో మెరుగైన రక్షణ కవరేజీ సహా బీమా వినిమయం విస్తరణకు దోహదం చేయనుందన్నారు. రాబోయే త్రైమాసికాల్లో జిడిపి వృద్ధికి సానుకూల ప్రభావం చూపుతుందన్నారు.

## నిర్మాణ వ్యయం తగ్గనుంది : అన్‌రాక్

కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టిలో మార్పులు చేస్తూ తీసుకున్న నిర్ణయం ద్వారా రియల్ ఎస్టేట్‌కు ఊతం లభించనుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. నిర్మాణ రంగంలోని పలు వస్తువుల ధరలకు సంబంధించిన శ్లాబులను మార్చడం ద్వారా ముడి సరుకుల వ్యయం తగ్గనుందని ఆన్‌రాక్ గ్రూప్ ఛైర్మన్ అనుజ్ పూరి పేర్కొన్నారు. సిమెంట్‌పై పన్నులు తగ్గడం ద్వారా నిర్మాణ వ్యయం 3-5 శాతం వరకు తగ్గనుందన్నారు.





RNI.No. TELTEL/2010/32434
అన్వేషణనేత్రం
ఎడిటర్ : గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

**బిజినెస్..**

# ప్రభావం చూపని జిఎస్‌టి శ్లాబుల తగ్గింపు

**ముంబయి :**

వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) శ్లాబుల తగ్గింపు మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపలేకపోతోంది. ఆర్థిక వ్యవస్థలో ఉన్న బలహీనతలు, అమెరికా టారిఫ్‌ల భయాలు ఇప్పటికీ ఇన్వెస్టర్లను వెంటాడుతున్నాయి. జిఎస్‌టి శ్లాబులను 5, 12 శాతాలకు తగ్గించడం ద్వారా మార్కెట్లు పరుగులు పెడతాయని ప్రభుత్వ వర్గాలు ఊహించినప్పటికీ.. ఆచరణలో భిన్నంగా ట్రేడింగ్ అవుతోన్నాయి. గురువారం, శుక్రవారం సెషన్‌లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ రోజు రోజుకు పడిపోతూ చరిత్రలోనే ఎప్పుడూ లేని కనిష్ట స్థాయి 88.27కు దిగజారింది. విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడంతో వారాంతం సెషన్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు మిశ్రమంగా నమోదయ్యాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 7.25 శాతం తగ్గి 80,710.76 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్ఇ నిఫ్టీ 7 పాయింట్లు పెరిగి 24,641 వద్ద నమోదయ్యింది. ఇంతక్రితం సెషన్‌లోనూ సెన్సెక్స్ 150 పాయింట్ల ర్యాలీతో సరిపెట్టుకుంది. వారాంతం సెషన్‌లో బిఎస్ఇలో మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకి, రిలయన్స్ ఇండిస్టీస్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ఉండగా.. ఐటిసి, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, టిసిఎస్ షేర్లు అధికంగా నష్టపోయాయి. నిఫ్టీలో మిడ్ క్యాప్ 0.20 శాతం, స్మాల్ క్యాప్ 0.19 శాతం చొప్పున పెరిగాయి. ఆటో రంగం 1.125 శాతం, లోహ రంగం 0.68 శాతం, మీడియా 0.59 శాతం చొప్పున పెరగ్గా.. ఐటి రంగం ఏకంగా 1.44 శాతం నష్టపోయింది. ఇదే బాటలో ఎఫ్‌ఎంసిజి 1.42 శాతం, రియాల్టీ 1.16 శాతం చొప్పున ప్రతికూలతను ఎదుర్కొన్నాయి.



# సభాపతి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి.. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

హైదరాబాద్,అన్వేషనేత్రం :




అసెంబ్లీ ప్రాంగణంలో సభాపతి కి జరిగిన అవమానం గురించి ఎలా మాట్లాడాలో కూడా అర్థం కావడం లేదని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీలో రాష్ట్ర ప్రజల సమస్యలపై కంటే ప్రతిపక్ష పార్టీ చేసే అరాచకాలపైనే చర్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఎవరూ మాట్లాడకుండా అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. శాంతమూర్తిలా ఉండే సభాపతి పై అవమానకరంగా మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఉదాసీనంగా ఉండడం వల్లే బీఆర్ఎస్ నాయకులు రెచ్చిపోతున్నారన్నారు.

# భావప్రకటన స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం

–టీయుడబ్ల్యూజే ప్రదర్శనలో ముక్తకంఠంతో హెచ్చరించిన జర్నలిస్టులు





అన్వేషనేత్రం,ఢిల్లీ సెప్టెంబర్ 08 :

దేశంలో భావాప్రకటన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని, మీడియా స్వేచ్ఛను హరించేందుకు పాలకులు ప్రయత్నిస్తే ప్రజాస్వామికావాదుల నుండి ప్రతిఘటన తప్పదని జర్నలిస్టులు హెచ్చరించారు. ఢిల్లీలో విధినిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై పోలీసుల దాడి, అక్రమ కేసు, అరెస్టును నిరసిస్తూ మంగళవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయుడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జర్నలిస్టులు, ప్రజాస్వామికావాదులు కొవ్వొత్తులతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బషీర్ బాగ్ లోని టీయుడబ్ల్యూజే కార్యాలయం నుండి ప్రాంభమైన ఈ నిరసన ప్రదర్శన,



నిజాంకాలేజీ మీదుగా జగజీవన్ రాం విగ్రహం వరకు కొనసాగింది. అనంతరం టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు సీనియర్ పాత్రికేయులు,ప్రజాస్వామికవాదులు ప్రసంగించారు. ప్రజాస్వామిక ఈ దేశంలో పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, స్వేచ్ఛను ఖునీ చేస్తూ,తమకు అనుకూలమైన విధానాలను ఎన్డియే ప్రభుత్వం అవలంబించడం అప్రజాస్వామికమని సీనియర్ పాత్రికేయులు, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్ ఆందోళన వ్యక్తం చేసారు. ఐదు రోజుల క్రితం ఢిల్లీలో విధినిర్వహణ లో ఉన్న మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన మహిళా జర్నలిస్టులు షాహిన్ ఖాన్, నఫీజా ఖాన్ లపై పోలీసులు దాడి చేయడం, వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను, జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఈ సభలో పాల్గొన్న పలువురు సూచించారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు అన్నారు. మహిళా జర్నలిస్టులకు న్యాయం చేయడంతో పాటు, ఘటనకు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ ప్రదర్శనలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, కె. అజిత, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షురాలు అత్తలూరి అరుణ, టీయుడబ్ల్యూజే మహిళా జర్నలిస్ట్స్ విభాగం కన్వీనర్ రాజేశ్వరీ, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు సంధ్య, సీనియర్ పాత్రికేయులు వనజ, స్వప్న, విమల, టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, బి. కిరణ్ కుమార్, హెచ్.యు.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, తెలంగాణ ఉర్దూ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ మోహియొద్దీన్ లతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## స్పీకర్ ను అవమానించిన తాత మధు వెంటనే క్షమాపణ చెప్పాలి

మధు వాక్యాలను ఖండించిన రాష్ట్ర కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

హైదరాబాద్,అన్వేషనేత్రం సెప్టెంబర్ 08 :

తెలంగాణ రాష్ట్ర స్పీకర్ పై అనుచిత వాక్యాలు చేసిన తెలంగాణ బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాత మధు వాక్యాలు ఖండిస్తూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో సహచర మహిళ నేతలతో కలిసి ట్యాంకుబండ్ దగ్గర గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలపడం జరిగింది.. ఈ సందర్భంగా నిర్మల రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన పదవి స్పీకర్ పదవినీ అవమానించేలా మాట్లాడిన తాత మధు వెంటనే క్షమాపణ చెప్పి ఆ మాటలను వెనక్కి తీసుకోవాలని అన్నారు..ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుంది.. ప్రజల కోసం మాట్లాడింది పోయి తమ స్వార్థ ప్రయోజనాల కోసం మాట్లాడటం సిగ్గుచేటు అని అన్నారు..ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళ అధ్యక్షురాలు రాజనాల లక్ష్మీ మహిళ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రజిత,తదితర ముఖ్య మహిళ నేతలు పాల్గొన్నారు.



# నేపాల్‌లో మానవతా సేవల జ్యోతి వెలిగించిన మాలోత్ కిషన్ లాల్ రాజ్‌పుత్

### రూ.6 లక్షల విలువైన విద్యా, నిత్యావసర సామగ్రి పంపిణీ

### బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన తెలంగాణ యువకుడు

మహబూబాబాద్, సెప్టెంబర్ 8 :



సేవే పరమో ధర్మం అనే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువ సామాజిక సేవకుడు మాలోత్ కిషన్ లాల్ రాజ్‌పుత్ మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం నేపాల్‌లో పర్యటిస్తున్న ఆయన అక్కడి నువాకోట్ జిల్లా సమరి గ్రామంలో బాధిత కుటుంబాలు, పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.6 లక్షల విలువైన సహాయ సామగ్రిని అందించి ప్రశంసలు అందుకుంటున్నారు. మంగళవారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. అలాగే పేద, నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, ఇతర అవసరమైన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, విద్యార్థులు కిషన్ లాల్ రాజ్‌పుత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నేపాల్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభ్యాసం కొనసాగిస్తున్న చిన్నారులకు విద్యా సామగ్రి ఎంతో ఉపయోగపడుతుందని స్థానిక ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అందించిన నిత్యావసర సరుకులు వారి జీవనోపాధికి కొంతమేర ఉపశమనం కలిగిస్తాయని అభిప్రాయపడ్డారు. మాలోత్ కిషన్ లాల్ రాజ్‌పుత్ సేవా కార్యక్రమాలు ఇదే మొదటిసారి కావు. గతంలో నేపాల్‌లో సంభవించిన భూకంపం అనంతరం కూడా ఆయన అక్కడికి వెళ్లి విస్తృత స్థాయిలో సహాయక చర్యలు చేపట్టారు. భూకంప బాధిత ప్రాంతాల్లో పాఠశాల విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని పంపిణీ చేయడమే కాకుండా, నిరాశ్రయులైన కుటుంబాలకు అండగా నిలిచారు. భూకంపం కారణంగా ఇళ్లు కోల్పోయిన కుటుంబాల కోసం 167 గృహాల నిర్మాణానికి సహకరించడంతో పాటు పలు భవనాల నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా వైద్య సదుపాయాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వందలాది మందికి వైద్య సేవలు అందించారు. ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలు అప్పట్లో అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందాయి.సరిహద్దులు, భాషలు, దేశాలకతీతంగా మానవతా దృక్పథంతో సేవలందిస్తున్న మాలోత్ కిషన్ లాల్ రాజ్‌పుత్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు సామాజిక కార్యకర్తలు పేర్కొన్నారు. సమాజానికి తిరిగి ఏదో ఒక రూపంలో సేవ చేయాలనే సంకల్పంతో ఆయన నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాకు చెందిన యువకుడు నేపాల్ వంటి విదేశీ దేశంలోనూ మానవతా సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందడం పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బాధలో ఉన్నవారికి అండగా నిలవడం, విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడడం వంటి కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని అభిప్రాయపడుతున్నారు.

# నూతన దంపతులకు శుభాకాంక్షలు

ఏ.కే ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది కట్టెబోయిన అనిల్ కుమార్



నాగార్జునసాగర్,అన్వేషనేత్రం :

నాగార్జునసాగర్ నియోజకవర్గం తిరుమలగిరిసాగర్ మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన బిక్షం యాదవ్ –లక్ష్మిల కూతురు చి"త్రివేణి –యాదాల చక్రిజివ యాదవ్ వివాహం ఇటీవల జరిగినది వారి ప్రత్యేక ఆహ్వానమేరకు వారి నివాసానికి వెళ్ళి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించిన ఏ కే ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది కట్టెబోయిన అనిల్ కుమార్ వారితో పాటు నియోజకవర్గ యాదవ సంఘం నాయకులు ఆకెనబోయిన రవిశంకర్ యాదవ్, మాజీ ఎంపిటిసి గుండెబోయిన అంజి, గుండెబోయిన శ్రీను, ఆవుల సాయిలు, గుండె బోయిన కొండలు వట్టె కోటేష్, మోకారాల అనిల్, ముని నాయక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# నిర్మాణ ఇళ్లలో చోరీలు.. నిందితుడికి రెండేళ్ల జైలు

### రూ.500 జరిమానా.. చెల్లించకుంటే మరో 15 రోజులు

### ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నల్లగొండ,సెప్టెంబర్ 8 ( అన్వేషనేత్రం ప్రతినిధి): నిర్మాణంలో ఉన్న ఇళ్లలో విద్యుత్ తీగలు, ఇతర సామగ్రి చోరీ చేసిన కేసులో నిందితుడికి రెండేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ నల్లగొండ మూడో అదనపు జూనియర్ ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఈ వివరాలను వెల్లడించారు. నల్లగొండ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలపై 2026లో కేసు నంబరు 58 కింద భారతీయ న్యాయ సంహిత 305(ఏ) సెక్షన్ ప్రకారం కేసు నమోదైంది. పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన ఎలక్ట్రీషియన్ గుంటి సుని (30)ను నిందితుడిగా గుర్తించారు. కేసు నంబరు 621/2026గా న్యాయస్థానంలో విచారణ జరిగింది. దర్యాప్తు అధికారి వై.సైదులు ఆధారాలు సేకరించి అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయస్థానం రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే అదనంగా 15 రోజుల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారి వై.సైదులు, సహాయ ప్రభుత్వ న్యాయవాది ఎన్.కృష్ణయ్య, జిల్లా నేర రికార్డుల విభాగం సీఐ శ్రీను నాయక్, న్యాయస్థాన విధుల అధికారి పి.వెంకటేష్, సమన్వయ అధికారులు హెచ్.పి.నరేందర్, పోలీస్ కానిస్టేబుల్ ఎన్.మల్లికార్జున్, సంబంధిత సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## బతుకమ్మ వైభవాన్ని ప్రపంచానికి చాటేలా యువ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్

ఛాలెంజ్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ /హైదరాబాద్, సెప్టెంబర్ 8 (అన్వేషనేత్రం ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు 'బతుకమ్మ యువ చిత్ర నిర్మాతల సవాల్--2026' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. లఘుచిత్రాలు, పాటలు, దృశ్య రూపకాల ద్వారా యువ చిత్ర నిర్మాతలు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ సవాల్ చక్కటి వేదికగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలను సృజనాత్మకంగా ఆవిష్కరించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. యువ చిత్ర నిర్మాతలు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'బతుకమ్మ యువ చిత్ర నిర్మాతల సవాల్--2026'ను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.



# సమాజ సేవకు 'లక్ష్మణ్' పురస్కారం


### కంది సూర్యనారాయణకు ఘన సన్మానం

నల్లగొండ /హైదరాబాద్, సెప్టెంబర్ 8 ( అన్వేషనేత్రం ప్రతినిధి):

సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న ప్రముఖ గాంధేయవాది కంది సూర్యనారాయణకు మిరియాల లక్ష్మణ్ స్మారక పురస్కారం లభించింది. మంగళవారం హైదరాబాద్ కోటిలోని బీసీ సాధికారత సంస్థ ఆడిటోరియంలో నాయీ బ్రాహ్మణ జన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించి పురస్కారాన్ని అందజేశారు. సమాజ సేవతో పాటు బీసీ సంఘం, నాయీ బ్రాహ్మణ సమాజ అభ్యున్నతికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రాపోలు సుదర్శన్, ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యుడు మోరంగం పెల్లి భాగయ్య, ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ అశోక్ కుమార్, ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యురాలు సావిత్రి, చాదర్‌ఘాట్ సీతారామాలయం ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కే. విజయ్‌సాయి, అంబర్‌పేట కృష్ణ తదితరులు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కంది సూర్యనారాయణ మాట్లాడుతూ యువత సమాజ సేవలో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహిళలు స్వావలంబన సాధించేలా కుట్టు శిక్షణ అందించేందుకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పేదలకు వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ జన సంస్థ గౌరవ అధ్యక్షుడు పి. వినోద్‌కుమార్, అధ్యక్షుడు శ్రీధర్ మురహరి,



ప్రధాన కార్యదర్శి నవనీత, ఉపాధ్యక్షుడు డాక్టర్ సుశీల్‌కుమార్, కే. జయంతి, మంజుల, జోష్ణ, వై. రేణుక, డాక్టర్ వెంకటేశ్, కార్యదర్శి ఎం. ప్రతాప్, కోశాధికారి వీ. రాజయ్య, సహాయ కార్యదర్శి ఎం. సదానందం, కార్యవర్గ సభ్యులు ఎం. తిరుపతి, ప్రవీణ్, సీహెచ్. విక్రమ్, నేలపట్ల సత్యనారాయణ, కంది హనుమాన్ ప్రసాద్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ టు ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు

## వాణిజ్యాన్ని పెంచేందుకు తెలంగాణ ప్రయత్నం
## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**న్యూఢిల్లీ,అన్వేషనేత్రం సెప్టెంబర్ 8 :**

తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, ఆహార,పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఆ దేశ క్యాబినెట్ సభ్యుడు శ్రీ ఫ్రాన్సిస్కో పి. టు లారెల్ జూనియర్‌తో సమావేశమయ్యారు. (ఫిలిప్పీన్స్‌లో శ్రీ ఫ్రాన్సిస్కో పి. టు లారెల్ జూనియర్ నిర్వహిస్తున్న పదవి, భారతదేశంలో నీటిపారుదల, వ్యవసాయం,ఆహార శాఖల బాధ్యతలు నిర్వహించే కేంద్ర క్యాబినెట్ మంత్రి హోదాకు సమానం.)తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులను పెంచడంతోపాటు తెలంగాణ--ఫిలిప్పీన్స్ మధ్య వాణిజ్యాన్ని మరింత విస్తరించే అవకాశాలపై ఇరువురు నేతలు వివరణాత్మకంగా చర్చించారు. భారతదేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా అవతరించిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. భారీ పరిమాణంలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, ఆధునిక రైస్ మిల్లింగ్ వ్యవస్థ, అవసరమైన అనుభవం తెలంగాణకు ఉన్నాయని తెలిపారు.తెలంగాణ నుంచి బియ్యం దిగుమతి చేసుకోవాలనే ప్రతిపాదనపై కార్యదర్శి లారెల్ సానుకూలంగా స్పందించారు.తెలంగాణ నుంచి మరింత పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఆయన తెలిపారు. సంబంధిత ప్రభుత్వ సంస్థలు, గుర్తింపు పొందిన దిగుమతిదారులు,ఎగుమతిదారులు, రైస్ మిల్లర్ల భాగస్వామ్యంతో ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే విధానంపై చర్చించారు. ఫిలిప్పీన్స్‌కు దిగుమతి చేసుకునే బియ్యం అవసరం గణనీయంగా ఉండటం, అంతర్జాతీయంగా బియ్యం సరఫరా చేసే దేశాల సంఖ్యను విస్తరించేందుకు ఆ దేశం ప్రయత్నిస్తుండటం నేపథ్యంలో ఈ చర్చలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. పోటీ ధరలు, విశ్వసనీయమైన నాణ్యత, నిర్ణీత సమయంలో సరఫరా చేయగల సామర్థ్యంతో తెలంగాణ దీర్ఘకాలిక భాగస్వామిగా నిలవగలదని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బియ్యం రకాలు, ధరలు, నాణ్యతా ప్రమాణాలు, కొనుగోలు విధానాలు, రవాణా, ధ్రువీకరణ ప్రక్రియలు,





శానిటరీ మరియు ఫైటోశానిటరీ నిబంధనలపై కూడా ఇరువురు చర్చించారు. ఈ అంశాలను సంబంధిత అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పరిశీలించి, వాణిజ్య అవకాశాలను కార్యరూపంలోకి తీసుకురావడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు.

తెలంగాణ నుంచి మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయడంపైనా కార్యదర్శి లారెల్ ఆసక్తి వ్యక్తం చేశారు. దీనిని స్వాగతించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, విత్తనోత్పత్తి, ఆహార శుద్ధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో తెలంగాణకు బలమైన సామర్థ్యం ఉందన్నారు. ఎగుమతికి అనువైన ఉత్పత్తులు, నాణ్యతా ప్రమాణాలు, అనుమతులు, ఇతర నియంత్రణ నిబంధనలను సంబంధిత ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు రంగ ప్రతినిధులతో కలిసి పరిశీలిస్తామని తెలిపారు.అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు అవకాశాలు కల్పించడం వల్ల రైతులు, రైస్ మిల్లర్లు, విత్తన కంపెనీలు, ఆహార శుద్ధి పరిశ్రమలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని ఇతర వర్గాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మంత్రి చెప్పారు.“తెలంగాణ రైతులు, వ్యవసాయ పరిశ్రమలకు స్థిరమైన, లాభదాయకమైన అంతర్జాతీయ మార్కెట్లను సృష్టించడమే మా లక్ష్యం. ఫిలిప్పీన్స్‌కు బియ్యం, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను దీర్ఘకాలంపాటు విశ్వసనీయంగా సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక నైపుణ్యం తెలంగాణకు ఉన్నాయి” అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

భారత్--ఫిలిప్పీన్స్ సంబంధాలు, ఆహార భద్రత, వ్యవసాయ సహకారం, తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు ప్రత్యక్ష వాణిజ్యాన్ని పెంచే అవకాశాలపై కూడా ఇరువురు విస్తృతంగా చర్చించారు. భారత్--ఫిలిప్పీన్స్ మధ్య అభివృద్ధి చెందుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో వ్యవసాయం, ఆహార వాణిజ్యం కీలక పాత్ర పోషించగలవని అభిప్రాయపడ్డారు.

ఉత్తమ్ కుమార్ రెడ్డి, కార్యదర్శి లారెల్ తమ తమ ప్రాంతాలను సందర్శించాల్సిందిగా పరస్పరం ఆహ్వానించుకున్నారు. 2026 డిసెంబర్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ రావాల్సిందిగా కార్యదర్శి లారెల్‌కు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానం అందించారు.చర్చించిన అంశాలను కొనసాగిస్తూ వ్యవసాయం, బియ్యం మరియు ఆహార ఉత్పత్తుల వాణిజ్యం, విత్తనాభివృద్ధి, అనుబంధ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరువురు నిర్ణయించారు. ఈ ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం, ఫిలిప్పీన్స్ రాయబార కార్యాలయం, సంబంధిత ఫిలిప్పీన్స్ సంస్థలు, ప్రైవేటు రంగ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# దళితుల అవమానాన్ని తెలంగాణ సమాజం సహించదు -- కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడితో బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ దళిత విభాగం గట్టి హెచ్చరిక





**హైదరాబాద్,అన్వేషనేత్రం సెప్టెంబర్ 08 :**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ (దళిత) విభాగం చైర్మన్, మానకొండూర్ శాసనసభ్యులు శ్రీ కవంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు, నిన్న అసెంబ్లీలో మరియు అసెంబ్లీ వెలుపల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఎర్రవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను కాంగ్రెస్ దళిత విభాగం నాయకులు ముట్టడించారు.ఈ నిరసన కార్యక్రమానికి హెచ్.ఆర్. మోహన్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ దళిత విభాగం అధికార ప్రతినిధి ఆధ్వర్యం వహించారు.ఈ సందర్భంగా హెచ్.ఆర్. మోహన్ మాట్లాడుతూ, దళితుడైన శాసనసభ స్పీకర్‌పై చేసిన అవమానకర వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తిపై చేసిన దాడి కాదని, యావత్ దళిత సమాజం ఆత్మగౌరవంపై చేసిన దాడి అని తీవ్రంగా మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక డీఎన్ఏ మరోసారి బయటపడిందన్నారు.కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు వెంటనే ఈ ఘటనపై స్పందించి తెలంగాణ దళిత సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా మరింత ఉధృతమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో వైస్ చైర్మన్ చుక్క శ్రీనివాస్ రావు, సమతా సుదర్శన్, దుర్గం శేఖర్, జీవనజ్యోతి రాజభద్రయ్య, అధికార ప్రతినిధి హైమావతి, కపిలేశ్వర్ రావు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీహరితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వేలమంది పాల్గొన్నారు.చివరగా హెచ్.ఆర్. మోహన్ మాట్లాడుతూ, “దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించిన వారిని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ క్షమించరు. కేసీఆర్ వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలి. లేకపోతే కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక రాజకీయాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.” అని హెచ్చరించారు.

# సభా మర్యాద మరిచారా? ప్రజాస్వామ్య గౌరవం ఎక్కడుంది? జిఎంఆర్ దేవరకద్ర శాసన సభ్యులు

**హైదరాబాద్,అన్వేషనేత్రం సెప్టెంబర్ 08:**



కేసీఆర్ ... మీ పార్టీ నేతలను అసెంబ్లీకి పంపింది ప్రజా సమస్యలపై చర్చించేందుకా? లేక స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసేందుకా...?పవిత్రమైన శాసనసభలో స్పీకర్ పదవికి, సభా గౌరవానికి భంగం కలిగించేలా మాట్లాడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయం.అసెంబ్లీకి రావాల్సిన బాధ్యతను విస్మరించి బయట నుంచి రాజకీయాలు చేయడం ఎందుకు?ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సభలో వ్యక్తిగత దూషణలకు దిగడం ఏ రాజకీయ సంస్కారం?“మేము కేసీఆర్ సైనికులం” అని చెప్పుకునే నేతలకు సభా మర్యాదలు పాటించడం కూడా నేర్పించలేదా? పదవులు పోయినా అహంకారం మాత్రం పోలేదని ప్రజలకు చూపించాలనుకుంటున్నారా? జీఎంఆర్ మాస్ పంచ్ సభను గౌరవించలేని రాజకీయాలకు ప్రజల గౌరవం ఎక్కడి నుంచి వస్తుంది?అధికారం శాశ్వతం కాదు...పదవి శాశ్వతం కాదు...కానీ ప్రజాస్వామ్య విలువలు శాశ్వతం!ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.అనుచిత భాషకు... అహంకార రాజకీయాలకు...ప్రజాస్వామ్యాన్ని అవమానించే విధానాలకు...ప్రజల తీర్పే తుది సమాధానం!రాజకీయాలు చేయండి...కానీ సభా గౌరవాన్ని దిగజార్చి కాదు!జి.మధుసూదన్ రెడ్డి,దేవరకద్ర శాసన సభ్యులు అన్నారు.

# మహిళా కాంగ్రెస్ బలోపేతం దిశగా పలు అంశాల పై కీలక చర్చ

**హైదరాబాద్,అన్వేషనేత్రం సెప్టెంబర్ 08:**

తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో ఏఐసీసీ కార్యదర్శి శ్రీ సచిన్ సావంత్ ని మర్యాదపూర్వకంగా కలిశాము.ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్‌కు సంబంధించిన పలు కీలక అంశాలతోపాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు అనుసరించాల్సిన వ్యూహం, క్షేత్రస్థాయిలో కమిటీల ఏర్పాటు, మహిళా నాయకత్వానికి ప్రాధాన్యం కల్పించడం, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించాము.ఈ సమావేశంలో ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషాశ్రీ తో కలిసి పాల్గొనడం జరిగింది.డా. రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ తదితరులు పాల్గొన్నారు.



# దళిత సమాజానికి క్షమాపణ చెప్పకపోతే ఉద్యమం మరింత ఉధృతం అవుతుంది

**నల్లగొండ అన్వేషనేత్రం సెప్టెంబర్ 08 :**



నల్లగొండ జిల్లా కేంద్రంలో పీసీసీ,మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కత్తుల కోటి మంత్రి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.దళితుల గౌరవాన్ని అవమానించే వ్యాఖ్యలు చేస్తే, నల్లగొండ గడ్డపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమంతో మీ రాజకీయ అహంకారానికి సమాధానం చెబుతాం. క్షమాపణ చెప్పకపోతే ఉద్యమం మరింత ఉధృతం అవుతుంది.

ప్రజల ముందే మీ వైఖరిని ఎండగడతాం. దళిత ఆత్మగౌరవం కోసం చివరి వరకు పోరాడతాం.దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. దళితుల ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది.

జై కాంగ్రెస్ -- జై హింద్ అంటూ హెచ్చరించారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధును వెంటనే భర్త రఫ్ చేయాలి

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

**నల్లగొండ, అన్వేషనేత్రం సెప్టెంబర్ 08:**

అసెంబ్లీలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధును వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నమల్ల అనిల్ డిమాండ్ చేశారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలోని క్లాక్ టవర్స్ సెంటర్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ తాతా మధు, టిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ దేవాలయం లాంటి అసెంబ్లీలో స్పీకర్ పై టిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం సూచనేమన్నారు.



ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తాత మధుపై కఠిన చర్యలు తీసుకొని అతని వెంటనే భర్త రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత బిఆర్ఎస్ నేతలు మతిస్థిమితం కోల్పోయి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.ప్రజావిశ్వాసం కోల్పోయిన బిఆర్ఎస్ నేతలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని ధ్వయంత్తారు.బీఆర్ఎస్ నేతలకు రాజకీయ విలువలు ఉంటే వెంటనే ఆ పార్టీ అగ్రనేతలు ఎమ్మెల్సీ తాత మధును ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు పెరిక వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి పెరిక అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పెరిక చిట్టి, జిల్లా కార్యదర్శి చింతమల్ల లింగమయ్య, సీనియర్ నాయకులు చింతమల్ల వెంకటయ్య జిల్లా నాయకులు సంద బాలస్వామి, ఎన్నమల్ల ప్రభాకర్ , బత్తుల సైదులు, అనుములపూరి నాగరాజు, తల్లమల్ల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.









RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

## ఆట

# టీ20 క్రికెట్‌లో శ్రీ చరణి అరుదైన ఫీట్!

దుబాయ్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు తన జోరును కొనసాగిస్తోంది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 137 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత క్రీడాకారిణులు అన్ని విభాగాల్లోనూ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా యువ బౌలర్, తెలుగు తేజం శ్రీ చరణి తన అద్భుతమైన బౌలింగ్‌తో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 193 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం 194 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన హాంకాంగ్ జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయింది. ముఖ్యంగా శ్రీ చరణి తన స్పెల్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టింది. తన అద్భుతమైన బౌలింగ్‌తో హాంకాంగ్ పతనాన్ని శాసించడంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో కేవలం 3.2 ఓవర్లు బౌలింగ్ చేసిన శ్రీ చరణి, 16 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టింది. ఈ ప్రదర్శనతో ఆమె ఒకే క్యాలెండర్ ఇయర్‌లో భారత మహిళల జట్టు తరఫున అత్యధిక టీ20 వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. 2026 క్యాలెండర్ ఇయర్‌లో చరణి ఇప్పటివరకు మొత్తం 31 వికెట్లు పడగొట్టింది. ఈ క్రమంలో 2024లో 30 వికెట్లు తీసిన దీప్తి శర్మ రికార్డును ఆమె అధిగమించింది. ప్రస్తుతం ఈ జాబితాలో స్పిన్నర్ పూనమ్ యాదవ్ అగ్రస్థానంలో ఉంది. ఆమె 2018లో 35 వికెట్లు తీసి ఈ రికార్డును నెలకొల్పింది. చరణి ప్రస్తుత ఫామ్ చూస్తుంటే, ఈ ఏడాది ముగిసేలోపు పూనమ్ యాదవ్ రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి.




# .ఏడుగురు ఆటగాళ్ళపై పాకిస్థాన్ వేటు

ఇంగ్లండ్ జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్ జట్టు చిత్తుగా ఓడిపోయింది. దీంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు జట్టు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా, జట్టులో పెను మార్పులకు శ్రీకారం చుడుతూ, ఏకంగా ఏడుగురు ఆటగాళ్ళపై వేటు వేసింది. ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాక్ జట్టు 194 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. దీంతో సిరీస్ మధ్యలోనే సమూల మార్పులు చేపడుతూ ఏకంగా ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించింది. అలాగే, రెడ్-బాల్ కోచింగ్ సిబ్బందిపై కూడా వేటు వేసింది. వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్, ఓపెనర్ ఇమామ్-ఉల్-హక్, పరిమిత ఓవర్ల క్రికెట్ మాజీ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘాతో పాటు అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, ముహమ్మద్ అవైస్ జాఫర్, ఖుర్రం షాజాద్లను జట్టు నుంచి విడుదల చేస్తున్నట్లు పీసీబీ ప్రకటించింది. వీరి స్థానంలో ఏడుగురు కొత్త ఆటగాళ్లను ఎంపిక చేసింది. వీరిలో సైమ్ అయూబ్, అబ్దుల్లా ఫజల్లకు టెస్ట్ అనుభవం ఉండగా, అరాఫత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బేగ్, మహమ్మద్ ఇమ్రాన్, రజావుల్లాలకు తొలిసారిగా టెస్ట్ జట్టులో చోటు లభించింది. ఆటగాళ్లపైనే కాకుండా కోచింగ్ సిబ్బందిలోనూ మార్పులు చేసింది. టెస్ట్ క్రికెట్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించింది. వారి స్థానంలో ఈ పర్యటన ముగిసే వరకు వైట్-బాల్ కోచ్ మైక్ హెసన్, యాష్లే నోఫ్కేలకు అదనపు బాధ్యతలు అప్పగించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో పాకిస్థాన్ ఇప్పటికే 0-2తో వెనుకబడగా.. ఆటగాళ్ల పేలవ ఫామ్, గాయాల వివాదాలే ఈ మార్పులకు ప్రధాన కారణమని తెలుస్తోంది. కాగా, ఇరు జట్ల మధ్య మూడో టెస్ట్ మ్యాచ్ ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభంకానుంది.

# భారత్--జపాన్ మధ్య చారిత్రాత్మక పోరు..

భారత్-జపాన్ దేశాల మధ్య దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని క్రికెట్ మైదానంలో ప్రత్యేక రీతిలో జరుపుకోనున్నారు. భారత పురుషుల క్రికెట్ జట్టు జపాన్‌తో ఓ టీ20 అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. ఇటువంటి అంతర్జాతీయ మ్యాచ్‌లో ఈ రెండు జట్లు తలపడటం ఇదే మొదటిసారి కావడం ఈ మ్యాచ్‌ను చారిత్రాత్మకంగా నిలుపుతోంది. సుజుకి కప్ సెప్టెంబర్ 22, 2026న టోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. జపాన్ క్రికెట్ అసోసియేషన్, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ ప్రత్యేక మ్యాచ్‌ను ప్రకటించాయి. భారత పురుషుల క్రికెట్ జట్టు ఈ నెలలో ఆసియా క్రీడల కోసం జపాన్‌కు వెళ్లనుంది, కానీ దానికి ముందు జరిగే ఈ మ్యాచ్ చాలా ప్రత్యేకమైనది. టీమిండియా జపాన్‌తో తొలిసారిగా అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. ప్రపంచంలోని అత్యంత బలమైన క్రికెట్ జట్లలో ఒకటైన భారత్, జపాన్‌లో క్రికెట్‌కు కొత్త రూపునివ్వడంలో కీలక పాత్ర పోషించగలదు. జపాన్ క్రికెట్ అసోసియేషన్ ఆ దేశంలో క్రికెట్‌ను అభివృద్ధి చేయడానికి, దాని ప్రాచుర్యాన్ని పెంచడానికి చాలా కాలంగా కృషి చేస్తోంది. అందువల్ల భారత జట్టుతో జరిగే మ్యాచ్ స్థానిక ఆటగాళ్లకు, క్రికెట్ అభిమానులకు ఓ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. భారత్, జపాన్ మధ్య జరిగే ఈ మ్యాచ్ 'స్పోర్ట్ 75' చొరవలో భాగంగా జరిగే తొలి ఈవెంట్. క్రీడల ద్వారా ఇరు దేశాల మధ్య ప్రజల సంబంధాలను, సహకారాన్ని ప్రోత్సహించడమే ఈ చొరవ లక్ష్యం. 2036 ఒలింపిక్, పారాలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలన్న భారత ఆకాంక్షను కూడా పరిగణనలోకి తీసుకుంటూ, క్రీడా రంగంలో పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు భారత్, జపాన్ అగ్ర నాయకత్వం మధ్య కుదిరిన ఒప్పందంలో ఈ చొరవ ఒక భాగం.ఈ మ్యాచ్ భారత క్రికెట్‌కు ఓ ముఖ్యమైన సందర్భమని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అభివర్ణించారు. జపాన్‌లో భారత జట్టు పాల్గొనడం కొత్త ప్రేక్షకులను చేరుకోవడానికి ఓ అవకాశమని ఆయన అన్నారు. చేయడానికి జపాన్ క్రికెట్ అసోసియేషన్‌తో కలిసి పనిచేస్తుందని కూడా ఆయన పేర్కొన్నారు.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA

# పనిపాటా లేనివాళ్లకే ఓటీటీలు..

సీనియర్ నటుడు శివాజీ పేరు ఇటీవలి కాలంలో వివాదాల్లో ఎక్కువగా వినిపిస్తోంది. మనసులో ఉన్నది ఉన్నట్లు ముఖం మీద కొట్టినట్లు మాట్లాడటం శివాజీ స్టైల్. ఈ విషయంలో ఎవరు ఏమనుకున్నా ఆయన వెనక్కి తగ్గరు. ఆ ముక్కుసూటితనమే వివాదాలకు కారణమవుతోంది. గతేడాది చివరిలో దండోరా సినిమా ఈవెంట్‌లో మహిళల వస్త్రధారణ గురించి శివాజీ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు తోడు ఏకంగా మహిళా కమీషన్ వరకు విషయం వెళ్లింది. ఆ తర్వాత ఈ వివాదం నెమ్మదిగా సద్దుమణిగింది. తాజాగా ఓటీటీలపై శివాజీ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ వివరాల్లోకి వెళితే.. భారతదేశాన్ని కరోనా మహమ్మారి కమ్మేసినప్పుడు అందుబాటులోకి వచ్చిన ఓటీటీలు దేశంలోని వినోద రంగంపై పెను ప్రభావాన్ని చూపించాయి. అప్పట్లో థియేటర్‌కు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు వినోదం కోసం ఓటీటీపైనే ఆధారపడ్డారు. ఆ తర్వాత లాక్‌డౌన్ ఎత్తివేసి థియేటర్లు తెరిచినా అటు వైపు వెళ్లడానికి ప్రేక్షకుడు అంతగా ఆసక్తి చూపించలేదు. పెరిగిన టికెట్ ధరలు, తినుబండారాల ధరలు సామాన్యుడికి వణుకు పుట్టించాయి. అంత ఖర్చుపెట్టి సినిమా థియేటర్‌కు వెళ్తే చెత్త కంటెంట్‌తో మేకర్స్ విసుగు తెప్పిస్తున్నారు. వేలకు వేలు ఖర్చు పెట్టే కంటే అతి తక్కువ ఖర్చుతో ఇంట్లోనే కుటుంబ సభ్యులంతా కలిసి చూసేలా ఓటీటీలు వినోదాన్ని అందిస్తుండటంతో ప్రేక్షకుడు ఇటువైపు మొగ్గుచూపుతున్నారు. ఒక్క భాషకు పరిమితం కాకుండా ప్రపంచం నలుమూలలకు చెందిన ఒరిజినల్ కంటెంట్‌ను ఆస్వాదించే అవకాశం కలిగింది. భారతదేశంలో ఓటీటీ మార్కెట్ గిరాకిని గుర్తించిన అనేక బడా కంపెనీలు ఇక్కడి సినిమాలు, వెబ్ సిరీస్‌లు, ఇతర ఒరిజినల్ కంటెంట్‌ను దక్కించుకుని ప్రేక్షకుడిని ఆకట్టుకుంటున్నాయి. నిర్మాతలకు ఓటీటీ రైట్స్ రూపంలో అదనపు లాభాలు రావడంతో వారు కూడా వీటిని ప్రోత్సహించారు. అయితే ఆ తర్వాత ఓటీటీ కంపెనీలు.. సినిమాలు ఎప్పుడు విడుదల చేయాలో డిసైడ్ చేసే స్థాయికి చేరుకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. మంచి సినిమాలు వస్తుండటంతో ఇప్పుడిప్పుడే ప్రేక్షకులు తిరిగి థియేటర్ బాట పడుతున్నారు. కాగా.. ఆనంద్ దేవరకొండ- వైష్ణవి చైతన్య జంటగా తెరకెక్కిన మూవీ ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్. ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ బ్యానర్‌పై సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్యలు నిర్మిస్తున్నారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా.. అజీమ్ మొహమ్మద్ సినిమాటోగ్రాఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఎపిక్ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషనల్ కార్యక్రమాలు వేగవంతం చేసింది. దీనిలో భాగంగా ఈ మూవీ టీమ్ ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాల్గొన్న నటుడు శివాజీ ఓటీటీలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓటీటీలలో కూడా డబ్బులు బాగా పెంచారు, డబ్బులు కట్టాలి ఫ్రీగా ఇవ్వరు. ఓటీటీ అనేది బాగా ఫ్రీగా ఉన్నోళ్లకి, ఇంట్లో ఉండి ఏం పోతాంలే అనుకునే లేజీగా ఉన్నోళ్లకే. సినిమా అనేది ఒక అద్భుతం.

# సౌందర్యను తలచుకుని అర్జున్ ఎమోషనల్

తనదైన నటన, యాక్షన్ సీక్వెన్స్‌లతో సౌత్ సినీ ఇండస్ట్రీలో గుర్తింపు తెచ్చుకున్నారు యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా . సుమారు మూడు దశాబ్దాలకు పైగా తెలుగు, తమిళంలో ఎన్నో చిత్రాల్లో నటించిన ఆయన ఎంతోమందిని తన అభిమానులుగా మార్చుకున్నారు. కేవలం యాక్షన్ చిత్రాలకే పరిమితం కాకుండా ఫ్యామిలీ ఆడియన్స్‌ని మెప్పించే సినిమాలు తీసి అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తూ వస్తున్నారు. ఇటీవలే 'బ్లాస్ట్'తో మన బాక్సాఫీస్ సత్తా తగ్గలేదని మరోసారి నిరూపించారు. అయితే ఈ ప్రయాణం వెనుక ఆయన పడిన ఎన్నో కష్టాలు, అవమానాలు దాగి ఉన్నాయి. కెరీర్ ఆరంభంలో ఎదురైన ఒడిదుడుకులు, అవకాశాల కోసం చేసిన పోరాటాలు తనను రాటుదేలేలా చేశాయని ఆయన తరచూ గుర్తుచేసుకుంటుంటారు. తాజాగా ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన కెరీర్, పరిశ్రమలోని స్నేహితులు, తన జీవితంలో అత్యంత విషాదకర ఘటన గురించి వివరిస్తూ ఎమోషనల్ అయ్యారు.సినీ రంగంలో స్వార్థం లేని స్నేహితులు దొరకడం ఎంతో అరుదని పేర్కొన్న అర్జున్... జగపతిబాబుతో తనకు ఉన్న సన్నిహిత అనుబంధాన్ని ప్రస్తావించారు. అదే క్రమంలో దివంగత నటి సౌందర్యని గుర్తుచేసుకుంటూ ఆయన కంటతడి పెట్టించే విషయాలను షేర్ చేసుకున్నారు. అందానికి అందం, అంతకుమించిన అద్భుతమైన సహజ నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న సౌందర్య.. తనకు కేవలం ఒక కో స్టార్ మాత్రమే కాదని, జీవితంలో లభించిన అత్యుత్తమ స్నేహితురాలని అర్జున్ కొనియాడారు. 'ఒకరిని కోల్పోతే కలిగే శూన్యం ఎంతటిదో, 'ఐ మిస్ యూ' అనే చిన్న మాటకు ఎంతటి బరువైన అర్థం ఉందో సౌందర్య మన మధ్య లేకపోవడంతోనే నాకు తెలిసింది' అంటూ ఆయన ఎమోషనల్ అయ్యారు. సౌందర్య భౌతికంగా దూరమైన తర్వాతే తన జీవితంలో ఆమె ఎంతటి స్థానాన్ని ఆక్రమించిందో మరింత లోతుగా అర్థమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్జున్, సౌందర్య కలిసి నటించిన సినిమాలు వెండితెరపై ప్రత్యేకమైన ముద్ర వేశాయి. ముఖ్యంగా 1998లో వచ్చిన కుటుంబ కథా చిత్రం 'శుభవార్త', 2001లో విడుదలైన భక్తిరస చిత్రం 'శ్రీ మంజునాథ'లో వీరిద్దరి మధ్య కుదిరిన ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఎంతగానో మెప్పించింది. కేవలం షూటింగ్‌లకే పరిమితం కాకుండా, తెరవెనుక కూడా ఒక ఆప్తురాలిగా సౌందర్య నిలిచారని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండే సౌందర్య వ్యక్తిత్వం, సహజ సిద్ధమైన నటన, మనుషులతో ఆమె మమేకమయ్యే తీరు ఎప్పటికీ మరువలేనివని అర్జున్ ఎమోషనల్ అయ్యారు. ఎన్ని సంవత్సరాలు గడిచినా సౌందర్య జ్ఞాపకాలు, ఆమెతో ఉన్న పవిత్రమైన స్నేహం తన గుండెల్లో శాశ్వతంగా నిలిచి ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.



# తొలిసారి 'హారర్ కామెడీ' బాటలో మాస్ మహారాజా

బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలైతే ఎలా ఉంటుందో మాస్ మహారాజా రవితేజ మరోసారి నిరూపించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘనవిజయం సాధించి థియేటర్లలో కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఈ చిత్రం తాజాగా రూ. 200 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ సైతం అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. సినిమా ఆరంభంలో బేబీ నక్షత్ర, రవితేజ, ప్రియా భవానీ శంకర్‌లపై చిత్రీకరించిన అన్‌సీన్ స్టిల్‌ను చిత్ర దర్శకుడు శివ నిర్వాణ పంచుకుంటూ సక్సెస్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ, తన భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో వేగాన్ని పెంచడమే కాకుండా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సరికొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఎప్పుడూ రొటీన్ మాస్, కమర్షియల్ ఫార్ములాకే పరిమితం కాకుండా, కెరీర్‌లోనే మునుపెన్నడూ చేయని వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ సరికొత్త ప్రయాణంలో భాగంగా టాలీవుడ్‌లో వైవిధ్యమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయతో రవితేజ చేతులు కలిపారు. 'సరిపోదా శనివారం' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వివేక్ ఆత్రేయ సిద్ధం చేసిన కథ రవితేజను అమితంగా ఆకట్టుకుంది.

Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434